
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 234 | బుధవారం 11 జూన్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-



# మోదీ ఇచ్చారు.. చంద్రబాబు ఎగ్గొట్టారు



- రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకునే స్థితిలో కూటమి ప్రభుత్వం లేదు
- చంద్రబాబు సీఎం కావడం రైతుల పాలిట శాపం
- రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు
- మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవాల్సిన పరిస్థితి

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి ప్రకాశం:**

రాష్ట్రంలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకునే స్థితిలో కూటమి ప్రభుత్వం లేదని, చంద్రబాబు సీఎం కావడం రైతుల పాలిట శాపమని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పొదిలి పొగాకు బోర్డును సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇవాళ రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రైతులను పట్టించుకునే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదు. రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రకాశం జిల్లాలో(పరుచూరు, కొండెపి) - మిగతా3లో



## సూపర్ సిక్స్‌లో మరో హామీకి
# గ్రీన్ సిగ్నల్



- నేడు తల్లికి వందనం పథకం నిధులు విడుదల చేయాలని నిర్ణయం
- 67.27 లక్షల మంది తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.8,745 కోట్లు జమ
- ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లి వందనం
- ఈ ఏడాది ఒకటో తరగతి, ఇంటర్‌లో చేరిన

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్**

సూపర్ సిక్స్‌లో మరో ముఖ్యమైన హామీని అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వానికి ఏడాదైన సందర్భంగా గురువారం తల్లికి వందనం పథకం నిధులు విడుదల చేయాలని నిర్ణయించారు. 67.27 లక్షల మంది తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.8,745 కోట్లు జమ చేయనుంది. ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లి వందనం ఇస్తామని ప్రభుత్వం తెలిపింది. ఈ ఏడాది ఒకటో తరగతి, ఇంటర్‌లో చేరిన వారికీ తల్లికి వందనం అమలు చేయనున్నారు. అడ్మిషన్ల పూర్తయ్యి డేటా అందుబాటులోకి రాగానే నిధులు జమ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. ఈమేరకు విధి విధానాలు ఖరారు చేస్తూ ఇవాళ జీవో విడుదల చేయనుంది. సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్, మెగా - మిగతా3లో

# కేసీఆర్‌పై ప్రశ్నల వర్షం

**50నిమిషాల పాటు ప్రశ్నించిన కమిషన్**

- కాళేశ్వరం కమిషన్ ఎదుట ముగిసిన కేసీఆర్ విచారణ
- అనకట్టల నిర్మాణానికి ఎవరు నిర్ణయం తీసుకున్నారని ప్రశ్నించింది.
- అనకట్టల నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం ఉందా?
- కాళేశ్వరం ప్రాజెక్టుపై అన్ని అంశాలతో ఉన్న పుస్తకాన్ని కమిషన్‌కు అందజేసిన కేసీఆర్
- ఎంత నీరు నిల్వ చేయాలన్నది ఇంజినీర్లు చూసుకుంటారు
- బ్యారేజీల నిర్మాణ స్థలం ఎంపిక, మార్పు సాంకేతికపరమైన అంశం



## గ్రామీణ యువతను పారిశ్రామికవేత్తలుగా
# తయారు చేస్తాం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- పెనుకొండలో సీ డాప్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు
- 25 రకాల చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుపై శిక్షణ
- స్థానిక అవసరాలకు తగ్గట్లు పరిశ్రమల ఏర్పాటు
- రుణాలు, సబ్సిడీలపై అవగాహన : మంత్రి సవిత
- భారీగా తరలొచ్చిన యువత



**అంకుశం ప్రతినిధిపెనుకొండ : జూన్ 11**

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న గ్రామీణ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. యువతకు ఉద్యోగాల కల్పనతో పాటు పలువురికి ఉపాధి కల్పించేలా 25 రకాల చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంతో పాటు యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ మరియు ఎంటర్ ప్రైజెస్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ (సీ డాప్ ), సెంచూరియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పరిశ్రమల ఏర్పాటు–ఉపాధి అవకాశాలపై యువతకు అవగాహన సదస్సును స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. - మిగతా2లో

# మోదీ ఇచ్చారు.. చంద్రబాబు ఎగ్గొట్టారు

-మొదటిపేజీ తరువాయి

ఇటీవలే ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. మద్దతు ధర కంటే తక్కవకు అమ్ముకోవాల్సిన పరిస్థితి.

మా హయాంలో రైతు రాజ్యం నడిచింది. కానీ, కూటమి ప్రభుత్వంలో రైతు నష్టపోతున్నాడు. మా హయాంలో ఖరీఫ్ సీజన్‌లోనే పెట్టుబడి సాయం అందించాం. చంద్రబాబు వచ్చాక రైతు భరోసా సాయం లేదు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలు కాకుండా మరో రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు అన్నారు. గతేడాది రైతు భరోసా రూ.20 ఎగ్గొట్టారు. మోదీ ఇచ్చారు.. చంద్రబాబు ఎగ్గొట్టారు

### మా హయాం.. రైతులకు స్వర్ణయుగం

మా ప్రభుత్వంలో రైతుకు కనీస మద్దతు ధర ఇచ్చాం. ప్రతీ రైతుకు అదనంగా రూ.10 వేలు ఇచ్చేవాళ్లం. పారదర్శకంగా ఉచిత బీమా అందించాం. మా హయాంలో రైతుకు వెన్నెముకగా ఆర్బీకే(రైతు భరోసా కేంద్రాలు)లు నిలిచాయి. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశాం. మార్కెట్‌లో పోటీ పెరిగి రైతుకు గిట్టుబాటు ధర వచ్చేది. కేంద్రం ప్రకటించిన పంటలకే కాకుండా.. రాష్ట్రం నుంచి అనేక పంటలకు కనీస మద్దతు ధర ఇచ్చాం. ఏ పంటకైనా గిట్టుబాటు ధర లేకుంటే ఆర్బీకే ద్వారా ఇచ్చేవాళ్లం. ఐదెకరాల మిర్చి రైతులకు రూ.4లక్షల పరిహారం ఇచ్చిన ఘనత మాది. మా హయాంలో రైతులకు సువర్ణ యుగం. ఏ రకంగానూ రైతును నష్టపోనివ్వలేదు.

### కూటమి పాలనలో అధ్వానం

కూటమి వచ్చాక ఉచిత బీమా ఎత్తేశారు. దళారీలు లేకుండా ఇప్పుడు పంట కొనే పరిస్థితి లేదు. ఈ క్రాప్ వ్యవస్థను నీరుగార్చారు. కూటమి వచ్చాక ఇన్‌పుట్ సబ్సీడీని గాలికొదిలేశారు. కల్తీ ఎరువులు, కల్తీ విత్తనాలతో



నష్టపోతున్నారు. 2023-24లో కేజీ పొగాకు రూ.366కి అమ్ముడుపోయేది. ఇప్పుడు రూ.240 కూడా అమ్ముడుపోవడం లేదు. క్వింటా పొగాకు రూ.24 వేలు తగ్గకుండా రైతు అమ్ముకున్నాడు. 220 మిలియన్ టన్నులు ప్రొక్యూర్ చేయాల్సి ఉంటే.. కేవలం 40 మిలియన్ టన్నులే ప్రొక్యూర్ చేశారు. హైగ్రేడ్ పొగాకుకు కూడా ఈరోజు గిట్టుబాటు ధర దక్కడం లేదు. పొగాకు బ్లాక్ బర్లీ రైతు ఎకరాకు రూ.80వేలు నష్టపోతున్నాడు. చంద్రబాబు సీఎం కావడం రైతులకు శాపం. మా హయాంలో మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాం. మార్క్‌ఫెడ్ రావడంతో మార్కెట్‌లో పోటీ పెరిగింది. మీరెందుకు ఆ పని చేయలేదు?. అసలు ప్రభుత్వం ఎందుకు మార్క్‌ఫెడ్ వేలంలో పాల్గొనలేదు. బాబు, దళారుల మధ్య సంబంధాలతో రైతులు నష్టపోతున్నారు.

### చంద్రబాబుకు జగన్ హెచ్చరిక

వ్యవసాయం దండగ అనే రీతిలో చంద్రబాబు పాలన కొనసాగుతోంది. పొగాకు వేసుకోమని చెప్పి రైతులను నట్టేట ముంచుతున్నారు. రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తాం జగన్ హెచ్చరికలు జారీ చేశారు.

# 10 మంది డేంజర్ లోనే...


**విశాఖపట్టణం :** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలపై చేస్తున్న సర్వేలలో షాకింగ్ విషయాలు బయటపడుతున్నాయట. చాలా మంది ఎమ్మెల్యేలు ప్రజల్లో వ్యతిరేకత ఎదుర్కొంటున్నారని సర్వేల ద్వారా స్పష్టమయిందంటున్నారు. జనసేన నుంచి గత శాసనసభ ఎన్నికల్లో 22 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. పోటీ చేసిన అన్ని చోట్ల విజయం సాధించారు. హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ సాధించిన జనసేన వచ్చే ఎన్నికల్లో ఇంకా ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తుంది. అయితే ఎన్నికయిన ఎమ్మెల్యేల్లో దాదాపు పది నుంచి పదిహేను మంది పై తీవ్ర వ్యతిరేకత ఉందని పవన్ కల్యాణ్ నిర్వహించిన సర్వేలో స్పష్టమయిందని చెబుతున్నారు. ఆ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పనితీరు సక్రమంగా లేదన్న రిపోర్టులు పవన్ కు చేరాయట. అలాగే సరుకులు ఇవ్వాలంటూ ప్రజాసమస్యలను పరిష్కరించడంలో... కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు కావడంతో వారు ప్రజామస్యలను పరిష్కరించడంలో వెనకబడి ఉండటమే కాకుండా అవినీతి ఆరోపణలు కూడా ఎదుర్కొంటున్నారని తెలిసి పవన్ నివ్వెరపోయారు. పవన్ కల్యాణ్ ఏరి కోరి నిజాయితీని ప్రధాన అంశంగా తీసుకుని గత ఎన్నికల్లో అభ్యర్థులను ఎంపిక చేశారు. కూటమి హవాలో గెలిచి తొలిసారి ఎమ్మెల్యేలు అయిన వారికి అవినీతి చేయడం కూడా పెద్ద చేతకావడం లేదని, నేరుగా వారే చేతులు చాస్తుండటంతో ప్రజల్లో పలుచనగా మారిపోయారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఇందులో మహిళ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని తెలిసింది. దీంతో పాటు కూటమిలోని పార్టీ నేతలు కూడా సహకరించకపోతుండటంతో మరింత పరిస్థితి అద్వాన్నంగా తయారైందన్న నివేదికలు అందాయని తెలుస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యే కు భారీగా ఆస్తులున్నాయి. ఎన్నికలకు ముందే ఆర్థికంగా స్థిరపడిన కుటుంబమే అయినా ప్రతి పనికీ పర్సంటేజీలు దండుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయట. ఆ



నియోజకవర్గంలో తొలిసారి జనసేన జెండా ఎగరడాన్ని టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో ఎమ్మెల్యేపై ఏ చిన్న అవకాశమొచ్చినా టీడీపీ, బీజేపీ నేతలే ఆ ఎమ్మెల్యేలు తమ అనుచరులతో సోషల్ మీడియాలో పోస్టింగ్ లు పెడుతూ బద్నాం చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిసి పవన్ ఒకింత ఆశ్చర్యపోయారట. దీంతో పాటు నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల విషయంలోనూ కూటమి పార్టీల నేతల మధ్య తలెత్తిన మనస్పర్థలు మరింత ఎమ్మెల్యే ప్రతిష్టను దిగజార్చేలా చేస్తున్నాయట.. ఇక గోదావరి జిల్లాలకు చెందిన ఒక ఎమ్మెల్యే పై కూడా ఆరోపణలు అధికంగా వచ్చాయి. తొలినాళ్లలో మంచి పేరు తెచ్చుకుని పవన్ దృష్టిలో పడిన ఆ ఎమ్మెల్యే చేతివాటం మామూలుగా లేదంటున్నారు. ప్రతి పనికీ పర్సంటేజీ దండుకుంటున్నారని తెలిసింది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన యువకుడయిన ఆయన తన అనుచరులతో బెదిరింపులకు దిగుతూ కాంట్రాక్టర్ల నుంచి బెదిరించి మామూళ్లు వసూళ్లు చేస్తున్నారన్న సమాచారం సర్వేలో తేలింది. దీంతో వచ్చే ఎన్నికల్లో ప్రస్తుతం ఉన్న ఇరవై రెండు మంది ఎమ్మెల్యేలలో పది నుంచి పన్నెండు మంది ఎమ్మెల్యేలకు టిక్కెట్ దొరకడం కూడా కష్టమన్న అభిప్రాయం జనసేనలో వ్యక్తమవుతుంది. వారి స్థానంలో కొత్తవారిని ఎంపిక చేసే అవకాశాలున్నాయన్న టాక్ పార్టీలో గట్టిగా వినిపిస్తుంది.

# డిజిటల్ పాలనపై ప్రభుత్వం దృష్టి

**నెల్లూరు :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూన్ 12న ఎన్డీఏ కూటమి పాలన ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా 'సుపరిపాలన-స్వర్ణాంధ్రప్రదేశ్' వేడుకలను నిర్వహించనుంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్ అధికారులతో ఈ కార్యక్రమం జరగనుంది. ఏడాది పాలనలో ప్రభుత్వం అమరావతి అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోంది. మెగా డీఎస్సీపై తొలి సంతకం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు వంటి హామీలను నెరవేర్చింది. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించనుంది. డిజిటల్ పాలనపై ప్రభుత్వం దృష్టి సారించింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 12తో ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పాలనకు ఏడాది పూర్తి అవుతుంది. ఈ నేపథ్యంలో వేడుకలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సుపరిపాలన- స్వర్ణాంధ్రప్రదేశ్ పేరుతో వేడుకలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. సుపరిపాలన- స్వర్ణాంధ్రప్రదేశ్ పేరుతో రాష్ట్ర స్థాయి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్ అధికారులతో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేయాల్సిందిగా సీఎస్ ఆదేశించారు.మరోవైపు 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీలతో కూడిన ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. 175 స్థానాలకు 164 స్థానాలను కూటమి కైవసం చేసుకుంది. 11 సీట్లకు పరిమితమైన వైసీపీ ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. ఈ ఏడాది పాలనలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమరావతిని రాజధానిగా కొనసాగిస్తూ.. అమరావతి అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యం ఇచ్చింది. ఏ ఫర్ అమరావతి, పీ ఫర్ పోలవరం అంటూ తమ ప్రభుత్వం ప్రాధాన్యాలను సీఎం నారా చంద్రబాబు నాయుడు తొలినాళ్లలోనే క్లారిటీ ఇచ్చారు.అలాగే ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసిన సీఎం చంద్రబాబు.. డీఎస్సీ పరీక్షలు కూడా నిర్వహించారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేస్తున్నారు. అలాగే అన్నా క్యాంటీన్ల ఏర్పాటు,



ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పెంపు చేపట్టారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశారు. జూన్ నెలలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను ప్రారంభించను న్నారు. అలాగే ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని కూడా కూటమి ప్రభుత్వం అమలు చేయనుంది. పార్టీల సంగతికి వస్తే మూడు కూటమి పార్టీల మధ్య మంత్రిత్వ పదవుల దగ్గర నుంచి నామినేటెడ్ పదవుల వరకూ.. పరస్పర అవగాహనతో పాలన సాగుతోంది. అలాగే ప్రభుత్వం డిజిటల్ పాలనపై ఎక్కువ దృష్టి పెడుతోంది. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలను ప్రజలకు చేరువ చేశారు. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం పరిశ్రమలకు ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నారు. అయితే సూపర్ సిక్స్ హామీల అమలు వేగంగా జరగట్లేదని కొన్ని చోట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. విపక్షం వైసీపీ కూడా ఇదే ప్రధాన అస్త్రంగా విమర్శలు చేస్తోంది.

## గ్రామీణ యువతనుపారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తాం

-మొదటిపేజీ తరువాయి

స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రంలో ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత, మార్కెట్ ఆధారిత నైపుణ్య కార్యక్రమాలపై శిక్షణ అందజేస్తూ, పల్లెల్లో చిన్న తరహా పరిశ్రమలను నెలకొల్పాలని నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగా 25 రకాల పరిశ్రమలను ఏర్పాటు చేయడంపై యువతకు శిక్షణ ఇవ్వడంతో పాటు సబ్సిడీ రుణాలు అందజేయనుందన్నారు. అదే సమయంలో వారు చేసే ఉత్పత్తులకు కూడా ప్రభుత్వమే మార్కెట్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ మరియు ఎంటర్ ప్రైజెస్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ (సీ డాప్ ), సెంచూరియన్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో పరిశ్రమల ఏర్పాటు-ఉపాధి అవకాశాల కల్పనపై అవగాహనతో పాటు శిక్షణా కార్యక్రమాలను తమ ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. పరిశ్రమల ఏర్పాటుపై యువతలో ఉన్న అపోహాలను ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా తొలగిస్తామన్నారు. రుణ సదుపాయలు, సబ్సిడీలపైనా ఈ సదస్సులో వివరించనున్నట్లు తెలిపారు. నియోజక వర్గంలోని అయిదు మండలాల్లోనూ ఈ తరహా అవగాహనతో కూడిన శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పెనుకొండలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున యువత తరలొచ్చిందని మంత్రి సవిత ఆనందం వ్యక్తంచేశారు.

20 లక్షల ఉద్యోగాలు కల్పించి తీరుతాం...

ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించి తీరుతామని మంత్రి సవిత స్పష్టంచేశారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు శ్రమిస్తూ... ఏపీలో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టేలా కృషి చేస్తున్నారన్నారు. ఎన్నో దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి తరలొస్తున్నాయన్నారు. పారిశ్రామికాభివృద్ధిలో పెనుకొండ నియోజక వర్గానికి ప్రథమ నిలిపేలా కృషి చేస్తున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు.

మహిళలకు ఎంతో మేలు

ఆయా ప్రాంతాల అవసరాలు, స్థానికంగా లభ్యమయ్యే రా మెటీరియళ్లకు అనుగుణంగా పరిశ్రమల ఏర్పాటుపై ఉత్సాహవంతులైన యువతకు అవగాహన కల్పించనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. అవసరమనుకుంటే పంచాయతీ స్థాయిలోనూ ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ శిక్షణా కార్యక్రమాలతో మహిళలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా పరిశ్రమల ఏర్పాటు ఉంటుందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. వ్యక్తిగతంగా, సామూహికంగా చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటులో మహిళలకు అండగా ఉంటామని మంత్రి సవిత స్పష్టంచేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సులో అధికారులు మాట్లాడుతూ, పరిశ్రమల ఏర్పాటు-ఉపాధి అవకాశాలపై యువతకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీ డాప్ అధికారులు, భారీ సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్‌లో మరో హామీకి గ్రీన్ సిగ్నల్

-మొదటిపేజీ తరువాయి

డీఎస్సీ, దీపం-2 పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది.

తల్లులకు అభినందనలు.. విద్యార్థులకు శుభాకాంక్షలు: మంత్రి లోకేశ్

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా తల్లికి వందనం అమలుకు శ్రీకారం చుట్టామని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ సందర్భంగా తల్లులకు అభినందనలు.. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. బడికి వెళ్లే పిల్లలందరికీ తల్లికి వందనం అందుతుందన్నారు. ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, దీపం-2 అమలు చేశామని పేర్కొన్నారు

## పోలవరం, బనకచర్లతో రాయలసీమ అభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

నింపే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు మంత్రి నిమ్మల రామానాయుడు. బుధవారం మంత్రి నిమ్మల రామానాయుడు కర్నూలు జిల్లాలో పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి నిమ్మల పాల్గొన్నారు. కల్లూరు మండలం తడకనపల్లెలో రూ.678.50 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించారు. రూ.141 లక్షలతో కర్నూలు - అనుగొండ రోడ్డు నుంచి దొడ్డిపాడు వరకు నిర్మించిన తారురోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాషా పాల్గొన్నారు. తడకనపల్లి గ్రామం మహిళలు దేశానికే గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా డ్వాక్రా సంఘాలు తీసుకువచ్చి, మహిళలకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత ఏపీ సీఎం చంద్రబాబుదేనని మంత్రి నిమ్మల రామానాయుడు ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన తర్వాతే మహిళలకు పూర్తిస్థాయిలో స్వాతంత్రం వచ్చిందని అన్నారు. మహిళల ఆరోగ్య భద్రత కోసం దీపం పథకాన్ని సీఎం చంద్రబాబు తీసుకువచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం మహిళా పక్షపాత ప్రభుత్వమని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే పెంచిన పెన్షన్ అందించామని వెల్లడించారు మంత్రి నిమ్మల రామానాయుడు. రూ.1000లు పెన్షన్ పెంచడానికి జగన్‌కి ఐదేళ్లు పట్టిందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. కర్నూలు జిల్లాలో 2294 పనుల కోసం రూ.2014 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు పలు కీలక పరిశ్రమలు తీసుకురావడం జరిగిందని చెప్పారు. 5653 హెక్టార్ల డ్రిప్‌ను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. రూ.3800 కోట్లు హంద్రీనీవా ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు వేగవంతం చేశామని తెలిపారు మంత్రి నిమ్మల రామానాయుడు. గత ఐదేళ్లలో ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండా, తట్ట మట్టి కూడా తీయలేదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మోటార్లను సైతం పూర్తి స్థాయిలో వాడుకోలేదని చెప్పారు. 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తుంటే, అందులో కర్నూలు జిల్లాకే 30 శాతం పోస్టులు కేటాయించారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## ఫ్యాన్ పార్టీకి ఊపిరి

-మొదటిపేజీ తరువాయి

మధ్య సఖ్యత లేకపోవడంతో పాటు నియోజకవర్గాల్లో విభేదాలు తీవ్ర స్థాయిలో ఉండటంతో లోకల్ గా ఉండే వైసీపీ నేతలు కూడా తమ ఆలోచనను మార్చుకున్నారని చెబుతున్నారు. నిన్న మొన్నటి వరకూ అవసరమైతే కూటమిలోని ఏ పార్టీలోనైనా చేరేందుకు సిద్ధమయ్యేందుకు ప్రయత్నించిన వైసీపీ నేతలు ఇప్పుడు పార్టీని వీడే ఆలోచనను మార్చుకున్నారు. వీడిన నేతలు... పైగా గత ఎన్నికలకు సమయంలో టిక్కెట్లు రాని కొందరు పార్టీని వీడి కొందరు వెళ్లిపోయారు. చివరి నిమిషంలో టిక్కెట్ కోసం కాంగ్రెస్ వంటి పార్టీల్లో చేరి పోటీ చేసి చేతులు కాల్చుకున్నారు. ఓటమి పాలయిన తర్వాత తిరిగి వైసీపీలోకి చేరేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని తెలిసింది. ముందుగా జిల్లా పార్టీ అధ్యక్షులతో టచ్ లోకి వెళ్లిన నేతలు జగన్ అనుమతి కోసం ఎదురు చూస్తున్నారని తెలిసింది. వచ్చే ఎన్నికలకు తాము పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని, తమకు ఉన్న ఆర్థిక బలంతో పాటు అనుచరుల బలం, ఓటు బ్యాంకు విషయాన్ని కూడా గుర్తు పెట్టుకోవాలని కొందరు నేతలు జిల్లా స్థాయి నేతలను అప్రోచ్ అవుతున్నట్లు సమాచారం. జగన్ గ్రీన్ సిగ్నల్ కోసం... అయితే వైసీపీ అధినేత వైఎస్ జగన్ నుంచి గ్రీన్ సిగ్నల్ అందకపోవడంతో చేరికలు ఇంకా మొదలు కాలేదని వైసీపీ సీనియర్ నేతలు చెబుతున్నారు. జగన్ అన్ని నివేదికలు చూసిన తర్వాత వారిలో కొందరి చేరికలకు అంగీకరించే అవకాశముందని తెలిసింది. ఇందులో రాయలసీమకు చెందిన నేతలు కొందరున్నారని చెబుతున్నారు. ఇక ఎస్సీ రిజర్వడ్ నియోజకవర్గానికి చెందిన నేతలు కూడా గత ఎన్నికల్లో టిక్కెట్ రాక పార్టీని వీడి వెళ్లిపోయారు. వారిలో కూడా కొందరు తిరిగి వైసీపీ గూటికి చేరుకునే ప్రయత్నం చేస్తుండటం విశేషం. అయితే జగన్ అన్ని రకాలుగా ఆలోచించి, నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను అధ్యయనం చేసిన తర్వాత చేరికలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారని తెలిసింది.

## సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వేసవి సెలవుల అనంతరం బడులు ప్రారంభమైన తొలిరోజే విద్యార్థులకు 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు' పంపిణీ చేసేందుకు కూటమి సర్కార్ ఏర్పాట్లు చేస్తుంది. జూన్ 12న స్కూళ్లు పునఃప్రారంభం కానున్న

# మైలవరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి

## ఎంపీ కేశినేని శివనాథ్





**అగ్రికల్చర్, హార్టికల్చర్, టూరిజం, స్పోర్ట్స్, ఇండస్ట్రీ పరంగా అభివృద్ధికి అవకాశం**

**అంకుశం న్యూస్ విజయవాడ జూన్ 11:** స్వర్ణాంధ్ర విజన్ -2047 కి సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం మైలవరం నియోజకవర్గం అభివృద్ధికి ప్రణాళిక సిద్ధమైంది. త్వరలో సీఎం చంద్రబాబుకి మైలవరం నియోజకవర్గ అభివృద్ధిపై డాక్యుమెంటేషన్ అందజేస్తామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ -2047 లో భాగంగా మైలవరం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి తయారైన డాక్యుమెంటేషన్ పై ఇబ్రహీంపట్నం మండలం గొల్లపూడి లోని శ్రీ సాయిదత్తా కళ్యాణ మండపంలో బుధవారం మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ఆధ్వర్యంలో పలు విభాగాల ప్రభుత్వాధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమీక్షా సమావేశానికి ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో హార్టికల్చర్ ఎక్కడైనా వుందంటే అది మైలవరం నియోజకవర్గంలోనే అంటూ...రాబోయే నాలుగేళ్లలో రాజధాని ప్రాంతంలో మరెన్నో అభివృద్ధి పనులు జరుగుతాయని అందుకు తగ్గట్లుగా హార్టికల్చర్ లో సప్లై వుండే విధంగా చూడాలని హార్టికల్చర్ అధికారులకు సూచించారు. భవానీపురం పవిత్ర సంగమం దగ్గర గత టిడిపి ప్రభుత్వ హయంలో జలహారతి కార్యక్రమం జరిగేది. ఆ సమయంలో చిరు వ్యాపారులు అక్కడ వ్యాపారం చేసుకునే పరిస్థితి వుండేదన్నారు. టూరిజం శాఖ వారు జలహారతి కార్యక్రమానికి మొదలుపెట్టే విధంగా చూడాలని.. ఆ కార్యక్రమం మొదలు అయితే అటు చిరు వ్యాపారులకు, ఇటు టూరిస్టుల సంఖ్య పెరగటానికి అవకాశం వుంటుందన్నారు. అమరావతి రాజధానికి అతి సమీపంలో వున్న మైలవరం నియోజవర్గం విజయవాడతో పాటు అమరావతి రాజధానికి ముఖ ద్వారమని, మైలవరం నియోజకవర్గంలో అగ్రికల్చర్, హార్టికల్చర్, టూరిజం, స్పోర్ట్స్ వంటి పలు విభాగాల అభివృద్ధికి అవకాశం వుందన్నారు.

ఈ సమావేశంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ అక్కల రామ్మోహనరావు (గాంధీ), మైలవరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ నూతలపాటి బాలకోటేశ్వరరావు (బాల), సివిల్ సప్లై డి.ఎమ్. ,విజన్ 2047 నోడల్ ఆఫీసర్ సతీష్, మైలవరం ఎమ్.డి.వో. విజన్ 2047 కో-ఆర్డినేటర్ అనురాధ లతోపాటు పలు విభాగాల ప్రభుత్వాధికారులు ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

# చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లిలో ఏరువాక ప్రారంభం

**విస్తారంగా వర్షాలు కురిసి.. పంటలు బాగా పండాలని ఆకాంక్షించిన పరిటాలసునీత**

**బసంపల్లిలో 40లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే**





**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 11:** రాప్తాడు నియోజకవర్గం చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామంలో ఏరువాక కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. గ్రామంలో ఏరువాక కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగింది. రైతు చెంద్రాయుడు పొలంలో రైతులు, అధికారులతో కలిసి ఏరువాకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులందరికీ ఏరువాక శుభాకాంక్షలు తెలపారు. ఎర్రటి బంగారం లాంటి నేలల్లో రైతుల మధ్య ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురిసి, రైతన్నల భూముల్లో సిరుల పంట పండాలని ఆమె ఆకాంక్షించారు. ప్రభుత్వం వేరుసెనగ, కంది వంటి విత్తనాన్ని సబ్సిడీపై అందిస్తోందని.. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరోవైపు బసంపల్లి గ్రామంలో 40లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సిసి రోడ్లను ఆమె ప్రారంభించారు. అలాగే 35వేలతో నిర్మించిన పశువులు, గొర్రెలు, మేకల దాహార్థి తీర్చడానికి మంచినీటి తొట్టెను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామస్థులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాప్తాడు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నట్టు చెప్పారు. గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించి.. ఏడాది కాలంలోనే ఎవరూ ఊహించని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి వైపు నడిపిస్తున్నారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో కూడా గత ఐదేళ్లలో చేయని పనులను ఈ ఏడాది కాలంలోనే చేసి చూపిస్తున్నామన్నారు. రానున్న నాలుగేళ్లలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని, ఇచ్చిన మాటపై నిలబడే కుటుంబం పరిటాల కుటుంబమని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం ఇటీవల మరణించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కిష్టప్ప నివాసానికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు....

## గంజాయి వివాదంలో చిక్కుకున్న సింగర్ మంగ్లీ?



**మంగ్లీపై కేసు నమోదు చేసిన పోలీసులు**

**హైదరాబాద్, జూన్ 11:** ప్రముఖ సింగర్ మంగ్లీ పుట్టి రోజు వేడుకల్లో గంజాయి కలకలం రేగింది. ఈ వేడుక ల్లో భారీగా గంజాయి, విదేశీ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ పార్టీకి హాజరైన పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించగా డ్రగ్స్ పాజిటివ్‌గా తేలినట్లు సమాచారం. సింగర్ మంగ్లీ పుట్టినరోజు వేడుకలు జూన్ 10 పదవ తేదీ మంగళవారం నిర్వహించగా.. అదే మంగళవారం సాయంత్రం ఆమె చేవెళ్లలోని త్రిపుర రిసార్టులో బర్త్ డే పార్టీని ఇచ్చింది. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, సినీ ఇండస్ట్రీకి చెందిన వారు మొత్తం 48 మంది వరకు ఈ పార్టీకి హాజరు అయ్యారని తెలుస్తోంది. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఈ రిసార్టు పై అర్ధరాత్రి రెండు గంటల తరువాత ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో 48 మందికి గంజాయి పరీక్షలు నిర్వహించగా 9 మందికి పాజిటివ్ నిర్ధరణ అయింది. దీంతో ఎన్‌డీపీఎస్ యాక్ట్, సౌండ్ పొల్యూషన్ యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు.గంజాయి తీసుకుంటూ దామోదర్ అనే వ్యక్తి పట్టుబడినట్లుగా తెలుస్తోంది. అనుమతి లేకుండా బర్త్ డే పార్టీని నిర్వహించడం... దీంతోపాటు గంజాయి, విదేశీ మద్యం, దొరకడంతో ఫోక్ సింగర్ మంగ్లీ, త్రిపురా రిసార్ట్ జిఎం శివరామకృష్ణ ల పై కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా డీజేప్లే చేసినందుకు డిజేను పోలీసులు సీజ్ చేశారు.

# 2కోట్లతో నిర్మించిన రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే దగ్గుపాటి

**ఈ ఏడాది కాలంలోనే ఏపీలో 36వేల కిలోమీటర్ల రోడ్లు వేశారు**


**అనంతలో 30 కోట్లరూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాం**





**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 11:** అనంతపురం జిల్లా అనంతపురం అర్బన్ పరిధిలోని కార్పొరేషన్ లో వివిధ అభివృద్ధి పనులకు రోడ్ల ను అనంతపురం శాసనసభ్యులు దగ్గుబాటి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అనంతపురం శాసనసభ్యులు దగ్గుబాటి ప్రసాద్ మాట్లాడుతూ.. ఒక ఏడాది పాలనలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నామని..మరో 10 నుంచి 15ఏళ్ల పాటు అధికారం మాదేనని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలో సుమారు రెండు కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. 80 ఫీట్ రోడ్డు మార్గంలో కోటి రూపాయల జడ్పీ నిధులతో అయ్యప్ప స్వామి ఆలయం వరకు నూతన రోడ్డు ప్రారంభోత్సవం, రుద్రంపేట పంచాయతీలోని సవేరా ఆసుపత్రి వద్ద 50 లక్షల ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో నిర్మించిన సిసి రోడ్డు, భైరవ నగర్ ఎక్స్ టెన్షన్ లో 50 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్డు నిర్మాణాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు ప్రజలు ఘన స్వాగతం పలికారు. రోడ్ల ప్రారంభోత్సవం అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ఒక్క కిలోమీటర్ రోడ్డు కూడా వేయలేదన్నారు. అడుగడుగునా విధ్వంసం సృష్టించారన్నారు. బటన్ నొక్కి సంక్షేమ అందిస్తున్నామని ప్రజలను మభ్య పెట్టారన్నారు. ఈ ఏడాది కాలంలోనే 36 వేల కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. ఒక అనంతపురం నగరంలోని ఇప్పటికే 30 కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించమని దగ్గుపాటి అన్నారు. ఇంటింటికి కొళాయి కనెక్షన్లు అందిస్తున్నామని.. అలాగే 16ఎం.ఎల్.డి. వాటర్ ప్లాంట్ నిర్మాణం పూర్తైందని.. దాన్ని కూడా త్వరలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 50కోట్ల రూపాయల మున్సిపల్ నిధులతో రోడ్డు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. నగరంలో గత ఐదేళ్లలో పార్కులను అధ్వానంగా మార్చారని..వాటిని కూడా పూర్తిగా మార్చి వేస్తున్నామన్నారు. సూర్య ఘర్ పేరుతో సోలార్ పవర్ ఇంటింటికీ అందించే విధంగా అలాగే రైతులకు సోలార్ మోటర్లు అందించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకుంటున్నారన్నారు. ఇంకా నాలుగేళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేయబోతున్నామని.. ఏపీని ప్రపంచ పటంలో రోల్ మోడల్ గా మారుస్తారని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు.

## కనుల పండువగా రెడ్డి సంఘం, ఆర్య కాపు, యాదవ, వెలమల శ్రీ మదన వేణుగోపాలస్వామి గ్రామోత్సవం



**కనిగిరి జూన్ 11 అంకుశం న్యూస్ :**కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో వెలసి ఉన్న శ్రీ మదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రెడ్డి సంఘం, ఆర్య కాపు, యాదవ, వెలమ సంఘాల ఆధ్వర్యంలో స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కేరళ వారి మేళ తాళాలు, కనక తప్పెట్లు, తీన్మార్ డ్రమ్స్, బేతాళ వేషధారణ, దేవీ దేవతల విచిత్ర వేషధారణ, కోలాటములతో వాణసంచాతో కనుల పండువగా నిర్వహించారు. పామూరు పట్టణం గ్రామోత్సవంతో శోభాయమానంతో వెల్లి విరిసింది. మధ్యాహ్నం సి ఎస్ పురం మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బోయళ్ల నారాయణరెడ్డి సౌజన్యంతో దేవస్థానంలో మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి ఘనంగా నిర్వహించారు. రాత్రి మాదిరెడ్డి నారాయణరెడ్డి సౌజన్యంతో నెల్లూరు రింగ్ రియాజ్ ఈవెంట్స్ వారిచే గొప్ప పాట కచ్చేరి కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బైరెడ్డి జయరామిరెడ్డి, తుమ్మ కొండారెడ్డి, బోయళ్ల నారాయణరెడ్డి, ఇర్రి కోటిరెడ్డి, ద్వారశీల సుబ్బారెడ్డి, పామూరు మాజీ సర్పంచ్ డివి మనోహర్, టిడిపి ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ హాజీ గౌస్ తదితర రెడ్డి సంఘం వారు, ఆర్య కాపు సంఘం వారు, యాదవ సంఘం వారు, వెలమ సంఘం వారు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ పై నుండి దూకి వ్యక్తి ఆత్మహత్య




**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 11:** మండపేట నియోజకవర్గం మండపేటలో మానసిక సమస్యతో బాధపడుతున్న వ్యక్తి వాటర్ ట్యాంక్ ఎక్కి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. మండపేట టౌన్ ఎస్ఐ జి.చంటి తెలిపిన వివరాల ప్రకారం సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామానికి చెందిన మోర్త సూరిబాబు గత కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతున్నాడు. కాగా అతను మండపేటలోని తన భార్య చెల్లెలు ఇంటికి కుటుంబ సమేతంగా చుట్టం చూపుగా వచ్చారు. ఇదిలా ఉండగా మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో బురుగుంటచెరువు దగ్గర ఉన్న వాటర్ ట్యాంక్ ఎక్కి పైనుంచి దూకి ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. దీంతో స్థానికులు పొటాహుటిన స్పందించి 108 అంబులెన్స్ లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ రాత్రి సుమారు 7 గంటల ప్రాంతంలో ఇతను మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంటి తెలిపారు.

## రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలకు రక్షణ లేదు-చైర్ పర్సన్ పతివాడ



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 11:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలంలో మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరిగిపోయాయని మండపేట పురపాలక సంఘ చైర్ పర్సన్ పతి వాడ నూక దుర్గా రాణి ఆరోపించారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. దీనికి నిరసనగా అమలాపురంలో జిల్లా వైసిపి పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగిన నిరసన ర్యాలీ లో మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. మహిళా చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎక్కడ మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా తక్షణమే ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. దీనిపై తమ పార్టీ తరపున నిరంతరం పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్,వైస్సార్సీపీ నాయకులు యరమాటి వెంకన్నబాబు ,ఎర్రగుంట అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

## అనపర్తిలో జరగబోయే మెగా జాబ్ మేళా కర పత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నల్లమిల్లి.



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 11:** అనపర్తి మండలం రామవరంలో జూన్ 13 వ తేదీన అనపర్తి లో జరగబోయే మెగా జాబ్ మేళా కరపత్రాన్ని ఆవిష్కరించి, 19 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్నాయని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో అనపర్తి మండల, రామవరం గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.